# రాజకీయం

### డి. విమల

మందు పార్టీ జోరుగా సాగుతోంది.

హైదరాబాదు నుండి వచ్చిన బడా రాజకీయ నాయకుడైన తన ప్రాణస్నేహితుడు కోటిరెడ్డి గౌరవార్థం తమ ఇంటిలో ఆ రోజు భారీ ఎత్తున పార్టీ ఏర్పాటుచేశాడు-ఆ ఊరి పంచాయితీ ప్రెసిడెంటు పాపిరెడ్డి.

పార్టీకి పెద్ద నాయకులతోపాటు పన్నపాటి నాయకులు-మొత్తం ఓ పదిమంది వరకూ హాజరయ్యారు.

అసలు పార్టీ ముఖ్యఉద్దేశం — సదరు హైదరాబాదు నుండి వేంచేసిన ప్రాణస్నేహితుడి ద్వారా తన కొడుకు సుబ్బారెడ్డికి రాబోయే ఎన్నికల్లో 'సీటు' సంపాదించాలని చోటా రాజకీయాల్లోనే తలనెరిసిన పాపిరెడ్డి దూరాలోచన-దురాలోచన.

సుబ్బారెడ్డి బస్తీ కాలేజీలో చేరి డిగ్రీ పుచ్చుకున్నాడు. పైచదువులు చదవాలనే కోరిక బలంగా వున్నా, అతని తండ్రి ససేమిరా వద్దన్నాడు.

చదువులు వచ్చి కూడు పెట్టవన్నాడు. గుడ్డ పెట్టవన్నాడు. తలదాచుకోడానికి నీడ చూపెట్టలేవన్నాడు. పెద్దపెద్ద చదువులు చదివిన వాళ్ళే కిళ్ళీబడ్డీలు పెట్టుకొని బ్రతుకుతున్నారన్నాడు. ఇంకా చాలా చాలా అన్నాడు. అనీ అని ఆఖరికి, చదువు మానేసి చక్కా ఇంటికి వచ్చేయమన్నాడు. బుద్ధిగా రాజకీయాల్లో జేరిపొమ్మన్నాడు. తనకెలాగూ వయసు అయిపోతోంది గదా-తన తర్వాత తన వారసత్వాన్ని తీసుకోమని హితబోధ చేశాడు. తన తర్వాత పంచాయితీ ప్రెసిడెంటుగిరి ఏకచత్రాధిపత్యంగా నువ్వే ఏలుకోమన్నాడు. తన తండ్రి యింతగా తన మేలు కోరి చెప్పినందుకు ఆలోచనలో పడ్డాడు సుబ్బారెడ్డి.

ఆలోచించాడు—బాగా ఆలోచించాడు.

అక్షరం ముక్కరాని తన తండ్రే అఖండంగా రాజకీయాల్లో వెలిగిపోతున్నప్పుడు— ఇక, పాలిటిక్స్‌తో బి.ఎ. పాసైన తనెంత అఖిలాండ బ్రహ్మాండంగా వెలిగిపోగలడో ఊహించుకున్నాడు.

ఊహించుకున్నదే తడువుగా పెట్టే బేడా సర్దుకొని, పుట్టి పెరిగిన పల్లెటూరు చక్కా వచ్చేశాడు. రాజకీయాల్లో రంగప్రవేశం చేశాడు. అదీ-సుబ్బారెడ్డి రాజకీయాల్లో చేరటానికి గల పూర్వకథ.

పార్టీ-బిల్డింగ్ పైన ఏర్పాటుచెయ్యబడింది. మూన్‌లైట్ పార్టీకి అన్ని హంగులూ వుండాలని పాపిరెడ్డి అభిప్రాయం.

అందుకే-ఫారిన్ బాటిల్స్‌తో పాటు ఫారిన్ బ్యూటీలను కూడా పిలిపించాలనుకున్నాడు గాని, పరిస్థితులు అనుకూలించనందువల్ల విధిలేక ఆఖరికి మద్రాసు నుండి ఛోటాతారల్ని ఓ ఇద్దర్ని పిలిపించాడు పాపిరెడ్డి. పాపిరెడ్డికి మిత్రుడు కోటిరెడ్డి టేస్టులు బాగా తెలుసు. ఆయనకి ఫారిన్ సరకంటే పిచ్చిమోజు.

ముందుగా 'మందు' పార్టీ మొదలైయింది.

బాటిల్స్ ఓపెన్ అవుతూనే వున్నాయి.

కాక్‌టైల్ చేసుకుని త్రాగేవారు కొందరు-

మత్తుమందుని డైల్యూట్‌చేసి త్రాగితే అందులో అసలు థ్రిల్ ఏముందని వొట్టి 'రా' సరుకునే గొంతు మండుతున్నా లెక్కచెయ్యకుండా గొంతుల్లో పోసేసుకుంటున్నారు మరికొందరు.

ఒకప్రక్క త్రాగుతూనే చికెన్‌ఫ్రైలూ,

చికెన్ తందూరాలూ, మటన్ ఫ్రైలూ, మటన్ రోస్టులూ నంజు కుంటూ, ఆదే టైంలో రాజకీయాల్ని కూడా అనర్గళంగా చర్చించుకుంటున్నారు.

అటువంటి సమయంలో—

క్రిందనుంచి ఓ పెద్ద అరుపు వినిపించింది.

ముఖం చిట్లించాడు పాపిరెడ్డి.

ఓ క్షణం త్రాగుతోన్న మందుని ఆపేసి, తింటున్న చికెన్‌రోస్టుని మధ్యలోనే నిలిపేసి, క్రిందనుండి వినిపించిన అరుపు మళ్ళీ వినిపిస్తుందేమోనని చెవులు చేటల్లా చెసుకొని వినసాగాడు.

మళ్ళీ అదే అరుపు—

హృదయ విదారకంగా

"బాబూ! మూడు రోజుల నుండి అన్నం లేదు. పిడికెడన్నం వుంటే పెట్టించండి బాబూ—"

పాపిరెడ్డికి ఒళ్ళు మండింది.

ఖుషీగా పార్టీ చేసుకుంటున్న ఈ ప్రశాంత వాతావరణంలో ముష్టివాడి అరుపులు అమృతంలో చిలికిన హాలాహలంలా తోచింది.

గ్లాసులో మిగిలిన మందుని గుటుక్కున గొంతులో పోసుకుని, చేతిలోవున్న చికెన్ ముక్కని పళ్ళక్రింద యిరికించుకొని కరకరా నములుతూ—

"వెంకన్నా" అని పిలిచాడు. కాదు....కాదు పెద్దగా అరిచాడు.

సదరు వెంకన్న పాపిరెడ్డి ఇంట నౌకరు.

తరతరాలనుండి వస్తున్న బానిసత్వానికి వెంకన్న కుటుంబం ఓ ఉదాహరణ. వెంకన్న తాత పాపిరెడ్డి తండ్రి దగ్గర వెట్టిచాకిరి చేశాడు. వెంకన్న తండ్రి పాపిరెడ్డి దగ్గర వెట్టిచాకిరీ చేస్తూచేస్తూ అకస్మాత్తుగా మరణించడంతో—ఇప్పుడు వెంకన్న ఆ పని చేస్తున్నాడు-వారసత్వాన్ని భుజాన వేసుకొని. కాబట్టి వెంకన్న కుటుంబ సభ్యులందర్లో ప్రవహించేది బానిస రక్తం అనడంలో ఆశ్చర్యపోవలసిన పనేలేదు.

వెంకన్న చాలా నమ్మకస్తుడు.

ఎంతో ప్రేమగా పెంచుకుంటున్న కుక్కయినా విశ్వాసాన్ని మరిచిపోయి కరుస్తుందేమోగాని వెంకన్న మాత్రం అలాంటివాడు కాదు. ఏ పని చెప్పినా నోరుమూసుకొని తల వొంచుకొని చెప్పింది భక్తిశ్రద్ధలతో చెయ్యడమే తెల్సుగాని—ఈ పని ఎందుకు చెయ్యాలి? ఈ పని చెయ్యడం వలన తనకు లాభమా? నష్టమా? అని ఆలోచించే లోకజ్ఞానంగానీ, అక్షర జ్ఞానంగానీ పూర్తిగా వెంకన్నకు లేదు. కూపస్థ మండూకంలా పెరిగాడు. అందుకే అతడికి తెలిసిందల్లా పాపిరెడ్డి ఇల్లూ-ఆ యింట్లోని మనుష్యులు. అయ్యగారు చెప్పారనో లేక అమ్మగారు చెప్పారనో-లేకపోతే ఆ యింట్లో ఎవరో కుటుంబసభ్యులు చెప్పారనో—వాళ్ళు తన యజమానులు కాబట్టి వారు చెప్పిన పని చెయ్యాలి. అలా చెయ్యడమే నౌకరు కర్తవ్యం. అలా చెయ్యకపోతే స్వామిద్రోహం అవుతుంది. కాబట్టి చెయ్యాలి-అనేది వెంకన్న విశ్వాసానికి, స్వామి భక్తికీ నిదర్శనం.

అందుకే—

'వెంకన్నా' అనే అరుపు పైనుండి వినిపించగానే—క్రింద ఇంటి ముందు—కుక్కలా కాపలా కాస్తున్న సదరు వెంకన్న రెండంగల్లో మేడమెట్లెక్కి—పరుగులాంటి నడకతో—అయ్యగారు పాపిరెడ్డి ముందు-చేతులు కట్టుకొని-తల వొంచుకొని-అతి వినయంగా నిలబడ్డాడు.

"పిలిచారా అయ్యగారూ"

"అవున్రా! క్రింద ఎవడో ముష్టివాడు అరుస్తున్నాడు వినబడిందా?"-కోపమూ-విసుగూ—అధికారమూ ధ్వనించాయి పాపిరెడ్డి మాటల్లో.

"వినిపించిందయ్యగారూ" — వినయంగా అన్నాడు వెంకన్న.

"ఏవిటీ వినిపించిందీ! మరయితే వాడి నెందుకు మెడపట్టుకొని గెంటలేకపోయావురా 'మాల'నా కొడకా...."

"పొమ్మన్నాను అయ్యగారు. కాని వాడు వినిపించుకోడంలేదు...."

"ఏమంటాడేవిటి?" కాళీ అయిన గ్లాసులో మరికాస్త బ్రాందీ పోసుకొని సిప్‌చేస్తూ అడిగాడు పాపిరెడ్డి.

"మూడురోజుల నుండి అన్నం లేదు.... కడుపులో ఆకలి మండిపోతోంది. నేను కదల్లేను....పార్టీ అయ్యేంతవరకూ యిక్కడే తొంగుంటాను. ఆనక మిగిలిపోయిందేదైనా వుంటే నా ముఖాన పడేయించండి. ఆకలి తీర్చుకుంటాను — అంటున్నాడండి. ఎంత చెప్పినా వినడంలేదండి" భయం భయంగా వున్న విషయాన్ని కాస్తా బయట పెట్టేశాడు వెంకన్న.

"నో....అలా వుండటానికి వీల్లేదు. వెస్టర్న్ మ్యూజిక్‌లాగా ఈ పార్టీ జరుగుతూన్నంత సేపూ ఆ ముష్టివాడి అరుపులు వినవలసిందేనా....నో నో....వాడిని వెంటనే మెడపట్టుకొని గెంటేయ్" వెంకన్నతో అని, మళ్ళీ ఒక్క క్షణం ఆలోచించి "వరేయ్ వెంకన్నా! నువ్వొక్కడివే ఏమీ చెయ్యలేవుగాని....ఒరేరే సుబ్బారెడ్డీ! వెంకన్నగాడితో క్రిందికెళ్ళి ఆ ముష్టివాడి కధేదో చూడు" అన్నాడు పాపిరెడ్డి కొడుకు సుబ్బారెడ్డితో.

తండ్రి ఆదేశాన్ని అందుకున్న సుబ్బారెడ్డి, గ్లాసులో సగానికి పైగావున్న మందుని గుటుక్కున గొంతులో పోసుకొని లేచి నిలబడ్డాడు.

అధికారదర్పంతో కదిలాడు.

కోపమైతే సుబ్బారెడ్డికి తెలుసుగాని—ఆ కోపంలో చేసే పనులకి పర్యవసానం ఎలా వుంటుందో లోతుగా ఆలోచించే రాజకీయ పరిజ్ఞానం యింకా అతడిలో చోటు చేసుకోలేదు.

* * *

"లంజాకొడకా! ఏమిట్రా నోటి కొచ్చినట్లు వాగావట. ముష్టెత్తుకొని బ్రతికే ముండా కొడుక్కి, అంత తలపొగరెందుకురా...."

త్రాగిన మైకం తలకెక్కితే అధికారమదం కళ్ళకెక్కి కళ్ళు చింత నిప్పుల్లా నిప్పులు చెరుగుతుంటే తనేం మాట్లాడుతున్నాడో తెలుసుకోలేని ఉన్మాద స్థితిలో సుబ్బారెడ్డి కోపంగా, ఆవేశంగా, పగపట్టిన త్రాచులా, సింహంలా ముష్టివాడి మీదికి లంఘించాడు.

సుబ్బారెడ్డి బూటుకాలు ముష్టివాడి గుండెల్లో బలంగా గుచ్చుకుంది.


ఒక్కసారి కాదు....రెండుసార్లు కాదు.... లెక్కలేనన్ని సార్లు—

అంతే!

మొదలు నరికిన చెట్టులా నేలకొరిగిపోయాడు ముష్టివాడు.

ముష్టివాడి నోటినుండి రక్తం కారుతోంది. గుండె పగిలి రక్తనాళాలు చిట్లి, గుండెల్లోంచి ఏకధారగా, గట్టులేని ప్రవాహంలా ప్రవహిస్తోంది రక్తం—

ఎందరి ఇంటి ముంగిటో నిలబడి, ఎంత మంది చేతనో చీదరింపులూ చీత్కారాలూ చవిచూచి అడుక్కుతిన్న అన్నం ప్రసాదించిన రక్తం—



మానాన్నీ, అభిమానాన్నీ మరచిపోయి, దీనంగా, హీనంగా బ్రతుకీడుస్తూ పెంచుకొన్న శరీరం నుండి కారిపోతున్న రక్తం—

రక్తం!....రక్తం!....

ఎర్రగా....ఎర్రఎర్రగా....రక్తం!!

గొంతుకోసిన కోడిపిల్లలా ముష్టివాడు నేల మీద పడి కొట్టుకుంటున్నాడు.

సొట్టలుపడి, చిల్లులుపడి శిథిలావస్థలోవున్న అల్యూమినియం గిన్నె ఎగిరి అల్లంత దూరంగా పడిపోయింది. ఆ గిన్నెలోవున్న నాల్గు అన్నం మెతుకులూ చెల్లాచెదురై-ఇక ఈ రోజుతో నీకూ మాకూ ఋణం తీరి పోయింది-అన్నట్లు నేలపాలయ్యాయి.

"పొగరు అణిగింది లంజాకొడుక్కి..."

సుబ్బారెడ్డి కసికొద్దీ తిట్టుకొన్నాడు.

అప్పటి వరకూ కోడిపిల్లలా కొట్టుకుంటున్న ముష్టివాడు అకస్మాత్తుగా కొట్టుకోవడం మానేశాడు.

రక్తం గడ్డకట్టింది.

వొళ్ళు చల్లబడిపోయింది.

కళ్ళముందు జరుగుతోన్న తతంగమంతా కళ్ళార్పకుండా చూస్తున సుబ్బారెడ్డి చల్లబడి పోయాడు. కంగారు పుట్టింది. తలకెక్కిన 'నిషా' అరికాళ్ళల్లోకి దిగిపోయింది.

ముష్టివాడికేమైంది? .... ఏమైంది? .... ఏమైంది?....

బుర్ర వేడెక్కింది సుబ్బారెడ్డికి.

అప్పటివరకూ ఒక ప్రేక్షకుడిలా నిలబడ్డ వెంకన్న గుండెల్లో ఎవరో చెయ్యిపెట్టి కెలికి నట్లయింది. కాని తనేమీ చెయ్యలేని నిస్సహా యుడు. అందునే ఏం జరుగుతుందో చూస్తూ వుండిపోయాడు.

"ఏమిట్రా యింకా అలాగే గుడ్లప్పగించి చూస్తున్నావ్....ఆ వెధవకి ఏమైందో చూడు" సుబ్బారెడ్డి అన్నాడు వెంకన్నతో.

వెంకన్న ఉలిక్కిపడి, గబగబా రెండడు గులు ముందుకు వేసి, ముష్టివాడి దగ్గరగా నడిచి, వొంగి, చేత్తో ముష్టివాడి చేతిని పట్టు కొని పామును పట్టుకున్నట్లు తుళ్ళిపడ్డాడు.

ముష్టివాడి చెయ్యి మంచులా తగిలింది.

గుండెలమీద చెయ్యిపట్టి గుండె కొట్టు కుంటుందేమో చూశాడు.

గుండె కొట్టుకోడం లేదు.

ముక్కుదగ్గర చెయ్యిపెట్టి చూశాడు.

ఊపిరి వొదలటం లేదు.

మూసుకున్న వాడి కళ్ళని చేత్తో తెరిచాడు.

తెరుచుకున్న రెప్పలు తెరుచుకున్నట్లే వుండిపోయాయి.

అంటే....అంటే....

వెంకన్న వొంట్లోని రక్తం గడ్డకట్టుకు పోతున్న ఛాయలు.

"ఏమిట్రా! అలా గుడ్లేసుకొని చూస్తావు? ఏమైంది వాడికి?" అసహనంగా అరిచాడు సుబ్బారెడ్డి.

వెంకన్నకు నోట మాట రాలేదు కాస్సేపు.

"బాబుగారూ!....చచ్చిపోయాడు" ఆఖరుకు అతికష్టంమీద గొణిగాడు వెంకన్న.

ఏమిటీ....చచ్చిపోయాడా?....

అంటే....అంటే తను కొట్టిన దెబ్బలకి గుండెపగిలి .... రక్తం కక్కి .... ముష్టివాడు చచ్చాడన్న మాట!....

ఎలా?....ఇప్పుడెలా?....

వాడి మరణానికి కారణం తనే!....

ఆ ఊహ రాగానే వొళ్ళు వొణకసాగింది సుబ్బారెడ్డికి.

గుండెల్లో దడ....వొళ్ళంతా చెమట.

కళ్ళముందు ఏవేవో భయంకరమైన దృశ్యాలు కనబడుతున్నాయి .... భయపెడు తున్నాయి....


కాని-అంతలోనే కోపం—

ఎంత పొగరు? ఆఫరాల్ అడుక్కుతినే వెధవకి ఇంత అహంకారమా?....పొమ్మని చెబితే వినకుండా మొరాయించి యిక్కడే బైఠాయిస్తాడా .... తగిన శాస్తే జరిగింది వెధవకి....

కాని....కాని .... ఇప్పుడు....జరగవలసిన కర్తవ్యం ఏమిటి?

వాడు చచ్చిపోయాడు.

తను కొట్టిన దెబ్బలకే చచ్చిపోయాడు.




అందులో సందేహంలేదు.

తను కొట్టినా-ముష్టివాడు చచ్చిపోయినా పర్వాలేదు. ఈ రహస్యం తనతోనే సమసి పోతుంది.

కాని—కాని—తను కొట్టడమూ — వాడు చావడమూ వెంకన్నగాడు చూశాడు.

వెంకన్నగాడు అందరికీ చెప్పేస్తాడేమో!

ఏడ్చాడు వెధవ!....వాడి మొఖాన కొంత డబ్బు కొట్టి వాడి నోరు మూయించేస్తే సరి పోతుంది....

అంతే!....అంతే!!....

ఆ ఆలోచన రావడమే తడవుగా గబగబ మెట్లెక్కి- తన తండ్రి దగ్గరికి చేరుకున్నాడు సుబ్బారెడ్డి.

* * *

కొడుకు రహస్యంగా తన చెవిలో చెప్పిన మాటలు విని హతాశుడై పోయాడు పాపిరెడ్డి.

గొంతులో పోసుకున్న మందు గొంతు దిగలేదు.

కళ్ళముందు - అందులోనూ 'మందు' మహిమతో మైకం క్రమ్మిన కళ్ళముందు— ఏవేవో దృశ్యాలు అస్పష్టంగా కదులాడుతున్నాయి.

"ఏమిటీ....నిజంగానేనా?" గొంతు ఎంత తగ్గించుకొని మాట్లాడాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు పాపరెడ్డికి.

గొంతులో ఆరాటం....వొణుకు....భయం అన్నీ కలిసి ఆ మాటల్ని పెద్దగా అనేసేట్లు చేశాయి.

"అవును డాడీ....పోనీలే డాడీ! వెధవ ముష్టివాడు....ఈ దేశానికి కొంత పీడ విరగడైంది" ఏదో ఘనకార్యం చేసినట్లుగా చెప్పాడు సుబ్బారెడ్డి. కాని ఆ మాటల వెనుక ఏమవుతుందో నన్న భయం లేకపోలేదు.

నోటిమాట రాలేదు పాపిరెడ్డికి.

తను విన్నది నిజమే. తన కొడుకు అబద్ధం చెప్పడంలేదు.

కాని....ఇప్పుడెలా?....ఇప్పుడెలా?

ఎంత ఆలోచించినా ఈ అపాయం నుండి తప్పించుకునే ఉపాయం కనిపించడంలేదు పాపిరెడ్డికి.

ఆలోచనలు ఆటంబాంబుల్లా ప్రేలుతున్నాయి....

హత్య....హత్య....హత్య....

సాక్ష్యాలూ....కేసులూ....శిక్ష....ఉరిశిక్ష...

అంతలోనే భయం—అంతలోనే ధైర్యం.

ఆఫ్టరాల్ ఒక ముష్టివాడిని చంపితే తన కొడుక్కి ఉరిశిక్ష వేస్తారా? తన పరువూ పలుకుబడీ ఏంగాను?....ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనకాల చావనా?....

ఏమో!....ఏమో!....

కాలం, ఖర్మం కలిసిరాకపోతే తాడే పామై కరుస్తుంది.

తను తీసుకోవలసిన జాగ్రత్తలు తను తీసుకోవాలి.

తప్పదు....తప్పదు....

మొద్దుబారిపోయింది మెదడు పాపిరెడ్డికి.

కొడుకుమీద ఎన్నో ఆశలు పెంచుకున్నాడు తను. ఒక్కగానొక్క కొడుకు. ఎన్నో నోములూ, వ్రతాలూ నోసి కన్న కొడుకు. వాడేదో పెద్ద రాజకీయనాయకుడై తననేదో ఉద్ధరిస్తాడనీ, తన పేరు ప్రతిష్ఠల్ని నిలబెడతాడనీ తనెన్నో కలలు కన్నాడు. తనెన్నో ఆశలు పెంచుకున్నాడు. కాని....కాని ఇప్పుడేమైంది? తన ఆశలన్నీ కూలిపోతున్నాయి. వాడు జైలు కెళితే తనకు దిక్కెవరు? తన తర్వాత తన పదవికి వారసుడెవడు? ఇంతకాలం పెంపుడు కుక్కలా పెంచుకున్న తన పదవిని వేరొకరికి తను ఎలా దానం చెయ్యగలడు? అందుకు తన మనసెలా వొప్పుకుంటుంది?....

హే భగవాన్! ఈ ఆపదనుండి యెలా కాపాడతావో-అంతా నీ మహిమే స్వామీ....

వాపోతున్నాడు పాపిరెడ్డి.

ఆలోచిస్తున్నాడు పాపిరెడ్డి.

అకస్మాత్తుగా అతని బుర్రకు ఏదో ఆలోచన తట్టింది.

కళ్ళు గట్టిగా మూసుకున్నాడు.

ఇప్పుడు కళ్ళముందు ఇంతకు ముందు కనిపించిన ఏ భయంకరదృశ్యాలూ కనిపించడంలేదు... ఓ మనోహరమైన దృశ్యం కనుల కింపుగా కనబడుతోంది.

ఆహా....ఆహా....ఏమి దృశ్యం....ఏమి దృశ్యం....

"పిచ్చినాయనల్లారా! ఎందుకలా భయపడి పోతారు?....నూరుమంది భీష్ములయినా పదివేల మంది కర్ణులయినా మిమ్మల్ని వెంట్రుకవాసి కూడా కదిలించలేరు. భయపడకండి. నేను మీకు అండగా వున్నంతకాలమూ మిమ్మల్ని ఏ శక్తీ జయించలేదు .... భయపడకండి...." అని అభయహస్తం ఇస్తున్నాడు శ్రీ కృష్ణపరమాత్ముడు—భయంతో వొణికిపోతున్న పంచ పాండవులకి.

ఎంత చక్కటి దృశ్యం!

ఎంత మనోహరమైన దృశ్యం!!

అసలు శ్రీకృష్ణపరమాత్ముడి అండదండలు లేకపోతే, కౌరవుల్ని పాండవులు జయించే వారా? ఏమో!....

ఏది ఏమైనా పాండవులకి శ్రీ కృష్ణుని అండదండలున్నాయ్.

మరి తనకు?....

తనకొడుకు నెవరీ ఆపదనుండి రక్షిస్తారు?

"పిచ్చినాయనల్లారా! మీరెంత వెర్రివాళ్ళు. ముంజేతి కంకణానికి అద్దం వెతుకుతున్నారు. నేనుండగా మీరెందుకు అలా కంగారు పడుతున్నారో అసలు అర్థం కావడంలేదు. అసలు నేనంటూ ఒకడ్ని వున్నానని మీరు ఊహించలేదా!....లేక నా శక్తి సామర్థ్యాలను శంకిస్తున్నారా?" అని — అపర శ్రీకృష్ణపరమాత్ముడిలా చిద్విలాసంగా నవ్వుతూ నిలబడి నట్లుంది-తన మిత్రుడు కోటిరెడ్డి.

అవును ఆ ఆలోచనే తనకు తట్టలేదు. తనెంత వెర్రివాడు.

లెంపలేసుకున్నాడు పాపిరెడ్డి. వేసుకొని తక్కున లేచి నిలబడ్డాడు. గబగబ నడుచుకుంటూ వెళ్ళి కోటిరెడ్డి ముందు నిలబడ్డాడు.

అప్పుడు కోటిరెడ్డి తన చేతిలోని మందుని అమృతంలా కొంచెం కొంచెం గొంతులో పోసుకుంటూ, మద్రాసు నుండి తేబడిన సినిమానటి తన స్వహస్తాలతో చికెన్‌రోస్టుని కొంచెం కొంచెంగా నోటికందిస్తూవుంటే మరోలోకంలో విహరిస్తూ ఆనందిస్తున్నాడు.

మరికాసేపటికి ఎదురుగా నిలబడ్డ పాపిరెడ్డిని పసిగట్టి విషయం ఏమిటని వరమిచ్చేదేవుడిలా అడిగాడు.

గుక్కతిప్పుకోకుండా అన్ని విషయాలూ విశదీకరించాడు పాపిరెడ్డి.

ఆఖరున–"మిత్రమా! నువ్వే నాకు దిక్కు. నాకు పుత్రభిక్ష పెట్టు" అని కూడా మొరపెట్టుకున్నాడు.

మిత్రుడి ఆరాటాన్నీ, భయాన్నీ, ఆందోళనన్నీ కళ్ళారా చూచిన బడారాజకీయనాయకుడు కోటిరెడ్డి ఫెళ్ళున నవ్వాడు.

"నువ్వింత పిరికివాడివని కలలో కూడా అనుకోలేదోయ్ మిత్రమా! ఇంత చిన్న విషయానికి మరీ యింత యిదిగా బెంబేలు పడిపోవాలా?....ఇలాంటి వాడివి యింత కాలం రాజకీయాల్లో ఎలా నెట్టుకురాగలిగావోయ్...." అన్నాడు మరోపెగ్గు నోట్లో పోసుకుని, అతి నెమ్మదిగా, తొణక్కుండా, బెణక్కుండా.

మిత్రుడి మాటలు అర్థంకాలేదు పాపిరెడ్డికి.

ఏమిటీ! తను భయపడుతున్నాడా ఊరికే. ఇది చిన్నవిషయమా? తన కొడుకేదో చిన్న కోడిపిల్లని తమాషాకొద్దీ పీకపిసికి చంపేశాడా ఏమిటి? అసలు ఏమిటి కోటిరెడ్డి ఉద్దేశం??

ఆ విషయాన్నే అడగాలనుకున్నాడు పాపిరెడ్డి.

కాని అడగలేకపోయాడు.

పాపిరెడ్డి ఏది అడగాలనుకుంటున్నాడో కోటిరెడ్డికి అర్థమైంది.

అందరి రాజకీయనాయకుల్లా మాటల్లో స్వర్గాన్ని చూపించాలనుకోలేదు. చేసి చూపించాలనుకున్నాడు. అలా అనుకున్నదే తడవుగా గబగబ అడుగులేసుకుంటూ క్రిందికి నడిచాడు.

ఆయన్ని అనుసరించారు పాపిరెడ్డి, సుబ్బారెడ్డి విషయం అర్థంకాక. ఇక్కడ యింత రభస జరుగుతున్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎవరి 'మందు' ఆనందంలో వారుండిపోయారు.

క్రిందికి దిగొచ్చిన కోటిరెడ్డి ఫోనెత్తుకున్నాడు.

ఏదో నంబర్ డైల్ చేశాడు.

"హలో....ఈజీట్ పోలీస్ స్టేషన్."

"..........."

"యస్....నేను .... కోటిరెడ్డిని మాట్లాడుతున్నాను."

"..........."

"నేనేనయ్యా. ఏమిటి చెముడేమైనా వచ్చిందా ఏమిటి?....ఎవరనుకుంటున్నావ్....

ఆఁ....ఇంతకీ ఉద్యోగం చేసుకుంటూ పెళ్ళాం పిల్లల్ని పోషించుకోవాలని వుందా లేదా?....

ఆఁ....ఆఁ....అదే చూస్తున్నాను .... త్రాగిన మైకంలో మాట్లాడుతున్నట్లుంది. కాస్త వొళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు. సరె....సరె.... వెంటనే వున్నపళంగా పాపిరెడ్డి యింటికి బయలుదేరి రా. తర్వాత అన్ని విషయాలూ చెబుతాను....సరే....సరే....క్షమించాల్లేవయ్యా నీ సోదీ నువ్వు ..."

ఫోను పెట్టేశాడు కోటిరెడ్డి.

ముచ్చెమటలు పట్టాయి పాపిరెడ్డికి. మలేరియా జ్వరం వచ్చినవాడిలా వొణికిపోతున్నాడు.

"అదేమిటయ్యా! మహానుభావా! యేదో రక్షిస్తావుగదాని నా గోడు నీకు చెప్పుకుంటే నువ్వు నట్టేట్లో ముంచేటట్లున్నావు. ఇంతకీ ఇప్పుడు రక్షకభటులెందుకయ్యా?" కంగారు కంగారుగా అడిగాడు పాపిరెడ్డి.

పాపిరెడ్డి భుజం మీద గట్టిగా చరిచాడు కోటిరెడ్డి.

"మిత్రమా! రక్షించినా భక్షించినా రక్షకభటులే సమర్థులు....అయినా ప్రజల్ని రక్షించవలసిన పోలీసుశాఖ వుండగా చట్టాన్ని మన చేతుల్లోకి తీసుకోవడం తప్పు కదూ....అయినా చూస్తూవుండు .... యేం జరుగుతుందో...." పక్కా రాజకీయ నాయకుడిలాగే మాట్లాడాడు కోటిరెడ్డి.

నోరు తెరచుకొని చూస్తూవుండిపోయాడు పాపిరెడ్డి.

* * *

మరో పది నిముషాల్లో ఇంటిముందు పోలీసు జీపు ఆగింది. ఆగిన జీపులోంచి కంగారు కంగారుగా దిగి, టోపీలూ, బట్టలూ సర్దుకొన్నారు యూనిఫారంలోవున్న సబిన్ స్పెక్టరూ, మరో నలుగురు కానిస్టేబుల్స్.

కోటిరెడ్డికీ, పాపిరెడ్డికీ విష్ చేసి, అతి విన

యంగా నిలబడ్డారు.

ఇనస్పెక్టర్ని ఓ గదిలోకి తీసుకుపోయాడు కోటిరెడ్డి.

విడు నా కొంప ముంచడుగదా-అని ఆలో చిస్తున్నాడు పాపిరెడ్డి.

మరో అయిదు నిముషాలకు కోటిరెడ్డి, సబ్ ఇనస్పెక్టరు గదిలోంచి బయటికి వచ్చారు. బహుశా వారిద్దరి రహస్య సమాలోచన ముగిసి నట్లుంది. కోటిరెడ్డి చిద్విలాసంగా నవ్వుతూ పాపిరెడ్డి ముఖంలోకి చూశాడు.

ఎస్. ఐ. గబగబ మేడమెట్లెక్కి పార్టీ జరుగుతున్న స్థలానికి వెళ్ళాడు. నలుగురు కానిస్టేబుళ్ళూ అయ్యగారిని అనుసరించారు. వారివెనకే పెళ్ళినడక నడుచుకుంటూ కోటిరెడ్డి ఆ వెనక పాపిరెడ్డి—ఆ తర్వాత సుబ్బారెడ్డి.

యస్.ఐ.ని చూస్తూనే 'మందు'లో మునిగి తేలుతున్న పెద్దమనుషులు కొంచెం కంగారు పడ్డారు. అసలు విషయం ఏమిటని తర్వాత నోళ్ళు తెరిచారు. వాళ్ళు నోళ్ళు మూసుకునే లోపలే ఇనస్పెక్టర్ చెయ్యవలసిన పనికాస్తా నిముషాల్లో చేసేశాడు.

ఒక మూలగా ముడుచుకు కూర్చున్న వెంకన్న రెండుచేతులకూ బేడీలు తగిలించ బడ్డాయి.

పాపిరెడ్డి, సుబ్బారెడ్డి నోళ్ళు తెరిచారు.

ఏమైంది!....ఏమైంది?....

అందరిలోనూ గుసగుసలు....కోలాహలం కలకలం....

వెంకన్న పైప్రాణాలు పైనే పోయాయి.

"ఇదేం న్యాయం బాబూ!....న్యాయాన్ని రక్షించవలసిన మీరే ఇంత అన్యాయానికి పూనుకున్నారేమిటి బాబూ!...." నెత్తినోరూ బాదుకున్నాడు వెంకన్న.

"నోర్ముయ్యిరా లంజాకొడకా. క్రింద పాపం అడుక్కు-తినే బిచ్చగాడ్ని చంపేసి వచ్చి నంగనాచిలా మాట్లాడుతున్నావట్రా ....పదరా పద....స్టేషన్కి పద....నీ చెమ్డాలు వొలిపిం చేస్తాను" హూంకరించాడు ఇనస్పెక్టర్.

కళ్ళు గిర్రున తిరిగాయి వెంకన్నకు.

ఏమిటీ తను బిచ్చగాడ్ని చంపాడా? ఎంత అన్యాయం. ఎంత ఘోరం.

వెంకన్నకు తన భార్యాబిడ్డలు గుర్తు కొచ్చారు.

భార్య రెండు సంవత్సరాల ...ండి మంచంలో తీసుకుంటోంది. ఎదిగి ...ళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలున్నారు. ఊహ. తెలీని పసికందులున్నారు. అప్పులున్నాయి... వస్థ లున్నాయి....తను జైలుకెళితే తనవాళ్ళ...వరు పోషిస్తారు?....దిక్కులేక వీధివెంట ప... అయ్యో!....అయ్యో! .... ఎంత అ... జరిగిపోయింది.

"బాబూ! మీరైనా చెప్పండి బాబు... కాలం మీ ఉప్పుతింటూ మీ కాళ్ళదగ్గర తొత్తులా పడివున్నాను. ఎప్పుడైనా ఇ... పనులు చేశానా చెప్పండి బాబూ! ... మీకు తెల్సు. మీరైనా కనికరించండి ...బూ" మాట్లాడుతోన్న వెంకన్న నోటిమీద ...స్. ఐ. లాఠీదెబ్బ ఫెడేల్మని పడింది. ... రక్తం చిమ్మింది.

"ఏమిట్రా దొంగనాయాలా! వాగుతు...వ్! ఎయ్ త్రీ నాట్ ఫైవ్! వీడ్ని లాకు... హుకూం జారీచేశాడు ఎస్. ఐ.


అయ్యగారి ఆజ్ఞ పడగానే వెంకన్నని బలి పశువుని లాక్కు-పోయినట్లు క్రిందికి లాక్కు-పోయారు పోలీసులు.

హృదయవిదాకరంగా విలపించే వెంకన్న కళ్ళల్లో మెదిలి మనసు చివుక్కు-మంది పాపిరెడ్డికి.

కాని—వెంటనే పుత్రప్రేమ అడ్డొచ్చింది. తలొంచుకున్నాడు పాపిరెడ్డి.

* * *

(డియర్ రీడర్స్! ఈ కథ యింతటితో అయిపోయింది. కాని మీలో ఎవరికైనా వెంకన్నను ఎందుకు అరెస్టు చేసిందీ అర్థం కాక, శవంలోని భేతాళుడిలా నన్ను నిలదీసి- 'వెంకన్నను ఎందుకు అరెస్టు చేశారు? అతడు చేసిన తప్పేమిటి? తెలిసీ సమాధానం చెప్పక పోయావో నీ తల వెయ్యి వ్రక్కలవుతుంది'_




అని శపించే పాఠకుల సౌకర్యం కోసం— ఈ క్రింది కథను యిస్తున్నాను చదవండి....)

♦ ♦ ♦

కోటిరెడ్డి చిద్విలాసంగా నవ్వి యిలా అన్నాడు పాపిరెడ్డితో—

"చూడ్రా పాపిరెడ్డీ! మనిద్దరిమధ్యా ఎంతో సన్నిహితం వుంది. నేనేది చేసినా నీ మేలు కోరే చేస్తాననే విశ్వాసం నా మీద నీకుంది. కాబట్టి నేను చెప్పేది విను. ముష్టివాడి చావు విషయం తెలిసిన వ్యక్తులు నలుగురు. నువ్వూ నేనూ, సుబ్బారెడ్డీ, మీ ఇంటినౌకరు వెంకన్న. అయితే ఈ నేరాన్ని వెంకన్న మీదికి నెట్టకుండానే సుబ్బారెడ్డిని ఈ ఊబిలోంచి బైటికి లాగొచ్చు. కాని ఈ రహస్యం రహస్యంగా వుంటుందనే నమ్మకం నాకు లేదు. అందుకే కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు. నువ్వెలాగూ తండ్రివి గనుక ఈ రహస్యాన్ని బయటికి చెప్పుకోవు. ఇకపోతే నేను-నీ మిత్రుడిని. ఎన్నికల్లో నీ సహాయసహకారాలు లేనిదే నేను పైపదవిని అలంకరించలేను. కాబట్టి నన్నూ వదిలేయ్. ఇకపోతే — మిగిలింది వెంకన్న. వాడెలాగూ పరాయివాడు. ఈ రోజు నమ్మకంగావున్నా రేపు వుంటాడనే నమ్మకం లేదు. తక్కువ కులంవాడికి తక్కువ బుద్ధులే వుంటాయి. వాడు వుండటం ఎప్పటికైనా మనకి అపాయమే. అందుకే-వాడిమీదే కేసు బనాయించాను. ఇప్పుడిక శాశ్వతంగా వాడి నోరు మూయించవచ్చు. ఇకపోతే సాక్ష్యాలూ ఆధారాలు అంటావా....అవి పుట్టించడం అదేమంత లెక్కలోనిది కాదు. ఒరేయ్ పాపిరెడ్డీ ఓ విషయం చెప్తాను వింటావా! .. కోర్టుకి చెవులే గాని కళ్ళు లేవురా....అదీ విషయం."

అలా చెప్తోన్న కోటిరెడ్డి, పాపిరెడ్డి కళ్ళకి గీతోపదేశం చేస్తున్న శ్రీ కృష్ణపరమాత్ముడిలా కనిపించాడు.

"ఆహా....ఓహో....ఏమి నీ రాజకీయ పరిజ్ఞానం....నీలో ఇంత రాజకీయ చతురత వుంది గనుకనే ఈ నాడు రాజకీయాల్లో నీ పేరు అరచేతి మందాన పేరుకుపోయి, దేదీప్యమానంగా వెలిగిపోతున్నావ్ ...వర్ధిల్లు! ఇంకా వెయ్యేళ్ళు వర్ధిల్లు."

పాపిరెడ్డి రెండుచేతులూ జోడించి మనస్ఫూర్తిగా మిత్రుడికి నమస్కరించాడు.

అంకితం:

('అన్నపూర్ణ'గా వాసికెక్కిన ఈ దేశంలో కూడా 'అన్నమో రామచంద్రా' అని ఆర్తనాదాలు చేసే అన్నార్తులకూ, చెయ్యని నేరానికి బలైపోతున్న 'వెంకన్న'లాంటి అభాగ్యులకూ, ఈ కథ అంకితం— రచయిత్రి)